దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం

- బీటీ, సీసీ రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లను నడుపుతున్న వ్యవసాయదారులు
- కొత్తగా నిర్మించిన రోడ్లు కూడా గుంతలమయంగా మారుతున్న వైనం
- అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



తుర్పుతండాలో ఇటీవల దమ్ము చక్రాల ట్రాక్టర్ వెళ్లడంతో ధ్వంసమైన బీటీ రోడ్డు

అర్వపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలకు పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని పాలకులు మారుమూల గ్రామాలకు సైతం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి బీటీ, సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. అయితే ఈ రహదారులు నిర్మించిన మూన్నాళ్లకే దెబ్బతిని ప్రజాధనం వృథా అవుతోంది. కొంతమంది రైతులు ట్రాక్టర్లకు దమ్ము చక్రాలను బిగించి బీటీ, సిమెంట్ రోడ్లపై నడుపుతుండడంతో రహదారులు ధ్వంసం అవుతున్నాయి.

బీటీరోడ్డు వేసిన వారం రోజుల్లోనే..

జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం తూర్పుతండాకు ఇటీవల రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించారు. అయితే ఈ రోడ్డు నిర్మించిన వారం రోజుల్లోనే రైతులు ట్రాక్టర్లను దమ్ము చక్రాలతో నడుపుతుండటంతో రోడ్డుపై అనేక చోట్ల బీటీ లేచి గుంతలమయంగా మారింది. ఈ విషయమై తండా గిరిజనులు వెంటనే సంబంధిత అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. మండలంలోని కాసర్లపహాడ్-కొమ్మాల, తిమ్మాపురం-సంగెం, కుంచమర్తి-సోలిపేట, అడివెంల, పర్సాయపల్లి తదితర గ్రామాల్లో కూడా ట్రాక్టర్లను దమ్ము చక్రాలతో నడుపుతుండటంతో ఆయా గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. అలాగే నకిరేకల్-తానంచర్ల హైవే సీసీ రోడ్డు, సూర్యాపేట-జనగామ హైవే బీటీరోడ్లు కూడా దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వారం రోజుల్లోనే ధ్వంసం



మా తూర్పుతండా గిరిజనుల ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా ఇటీవల బీటీ రోడ్డును నిర్మించారు. కాని ఈ రోడ్డు ఏర్పడిన కళ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. బీటీ రోడ్డు నిర్మించిన వారం లోపే రెండుసార్లు దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను రోడ్డుపై నడపడంతో ఈ రోడ్డు పలుచోట్ల గుంతలు పడి ధ్వంసమైంది. ఈ విషయమై అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం.

– కేతావత్ సైదులు, తూర్పుతండా

కేసులు నమోదు చేస్తాం



బీటీ, సిమెంట్ రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడిపి రహదారులను ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటాం. ప్రజా అవసరాల కోసం కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లపై దమ్ము చక్రాల ట్రాక్టర్లను నడపడం తగదు. ఎక్కడైనా రోడ్లు ధ్వంసం చేసినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– సీహెచ్.బాలకృష్ణ, ఎస్ఐ

స్నేహంతోనే నిజమైన బంధం

- సూర్యాపేట డీఎస్పీ రవి



చిన్ననాటి మిత్రుడైన ఖాజాఅలీతో డీఎస్పీ

సూర్యాపేటటౌన్ : స్నేహంతోనే నిజమైన బంధం ఏర్పడుతుంది. ఒక్కసారి స్నేహం చేస్తే జీవితాంతం ఎన్ని అడ్డంకులు వచ్చినా కలిసి మెలిసి ఉంటేనే అది నిజమైన స్నేహం. నా చిన్ననాటి మిత్రుడు ఎండీ. ఖాజాఅలీ. మేమిద్దరం 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు కలిసి చదువుకున్నాం. స్కూల్‌లో అయినా.. కాలేజీలో అయినా.. తరగతి గదిలో ఒకటే బెంచీలో కూర్చునే వాళ్లం. ఖాజాఅలీ ప్రస్తుతం ఆలేరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అయినా ఇప్పటి వరకు తమ స్నేహంలో ఎలాంటి విభేదాలు రాలేదు. మేమిద్దరం ఒకే కుటుంబంలా కలిసి మెలిసి ఉంటాం. ప్రతిరోజు కనీసం ఒకసారైనా ఫోన్‌లో మాట్లాడుకుని యోగ క్షేమాలు తెలుసుకుంటాం. మాకు ఎలాంటి ఆపదలు వచ్చినా ఒకరినొకరు మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకుంటాం. ప్రస్తుతం కొందరు స్నేహం పేరుతో మోసం చేస్తున్నారు. అలాంటి వారితో స్నేహం చేయకపోవడమే మంచిది.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

భానుపురి : కేరళలోని వయనాడు వరద బాధితులకు విరాళాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. కేరళ వరద బాధితుల సహాయార్థం శనివారం సూర్యాపేటలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్తక, వ్యాపార వర్గాల దగ్గర విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేరళలో వరద బీభత్సం వల్ల అనేక గ్రామాలు నామరూపాలు లేకుండా అయ్యాయని, వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కులాలకు, రాజకీయాలకు, మతాలకు అతీతంగా కేరళ వయనాడు బాధితులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు జె.నర్సింహారావు, దండా వెంకటరెడ్డి, పులుసు సత్యం, కొప్పుల రజిత, చిన్నపంగి నరసయ్య, రాంబాబు, బొమ్మిడి లక్ష్మీనారాయణ, వినోద్, వల్లపు దాస్ సాయికుమార్, ఎండీ జహంగీర్, నల్లమేకల అంజయ్య పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో 'జయ' విద్యార్థుల ప్రతిభ



అఫ్సాన్



సాయిశివాని



వరప్రసాద్



సబ్రీన్



సనాఫాతిమా



సుసాన్

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల బైపీసీ విద్యార్థులు మొదటి బ్యాచ్‌లోనే నీట్-2024 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. శనివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఎస్.కె.అఫ్సాన్ 2744, పి.సాయి శివాని 2957, ఎస్. వరప్రసాద్ 3237, సబ్రీన్ 10982, సనాఫాతిమా 20249, సూసన్ 20266 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. కళాశాలలో నీట్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న 10 మంది విద్యార్థుల్లో నలుగురు మెడికల్ సీట్లు, ఇద్దరు డెంటల్ సీట్లు సాధించారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన ఏపూరి సోమన్న



సీఎం రేవంత్‌రెడ్డితో ఏపూరి సోమన్న

తిరుమలగిరి : బహుజన యుద్ధ నౌక ఏపూరి సోమన్న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

నాగారం : మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు బుర్రి సురేష్‌రెడ్డి తండ్రి బుర్రి బుచ్చిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, కూరం వెంకన్న, దోమల వెంకన్న, పాశం మధుసూదన్ రెడ్డి, కన్నెబోయిన మల్లేష్, వేణుగోపాల్‌రెడ్డి, కన్నెబోయిన కుమార్, సోమలింగం, గంగయ్య, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత




ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : మండల పరిధిలోని తాటిపాముల గ్రామానికి చెందిన నాయిని ముత్తయ్య కిడ్నీ సమస్యతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చుల కోసం వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా.. తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ శనివారం రూ.2.50 లక్షల ఎల్ఓసీని హైదరాబాద్‌లో బాధిత కుటుబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నాయిని కృష్ణ, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్(ఎస్) : తెలంగాణ ప్రభుత్వం అందించే రైతు బీమాకు ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దివ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఇంకా 2600 మంది రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని అన్నారు. సోమవారం చివరి తేదీ కావడంతో రైతులు తమ దరఖాస్తులను ఆయా క్లస్టర్‌లలోని ఏఈఓలకు స్వయంగా ఇవ్వాలని సూచించారు.

బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సంతోష్‌నాయక్



తిరుమలగిరి : భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తిరుమలగిరి మండలం నెల్లిబండ తండాకు చెందిన ధరావత్ సంతోష్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఇన్‌చార్జ్ కళ్యాణ్‌నాయక్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా సంతోష్‌నాయక్ మాట్లాడారు. తన నియామకానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, గిరిజన మోర్చా అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా పాఠశాలలకు ఎంపిక

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు క్రీడా పాఠశాలలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామ నరసమ్మ తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు మెమొంటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బద్ది వైష్ణవి కరీంనగర్ పాఠశాలకు, పుల్లూరి నితిన్ ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలకుర్తి ఎల్లయ్య, పాలకూరి జ్యోతి, మల్లెపాక రవీందర్, గుండ్ల ఆంజనేయులు, శీలోజ, రమాదేవి, అబ్బగాని మంజుల పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

పబ్లిక్ క్లబ్‌ను ఫ్యామిలీ క్లబ్‌గా తీర్చిదిద్దుతా

- సూర్యాపేట పబ్లిక్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి



క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వేణారెడ్డిని అభినందిస్తున్న నాయకులు

భానుపురి : సూర్యాపేట పబ్లిక్ క్లబ్‌ను అందరి సహకారంతో ఫ్యామిలీ క్లబ్‌గా తీర్చిదిద్దుతానని పబ్లిక్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం క్లబ్ అధ్యక్షుడు, స్థానిక ఆర్డీఓ వేణు మాధవరావు అధ్యక్షతన సూర్యాపేట పబ్లిక్ క్లబ్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శిగా కొప్పుల వేణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మద్ది హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా బొల్లెద్దు దశరథ, కోశాధికారిగా కక్కిరేణి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా శనగాని రాంబాబు, పోలెబోయిన నరసయ్య, గవ్వ కేశవరెడ్డి, ఫరీరుద్దీన్ అహ్మద్, నిమ్మల వెంకటేశ్వర్లు, బత్తిని వెంకటేశ్వర్లు, రాచకొండ శ్రీనివాస్, గోవా కృష్టారెడ్డి, చల్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట తహసీల్దార్ శ్యామ్, క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలుచేయాలి

సూర్యాపేటటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని, కానీ అమలు చేయకుండా అగ్రవర్ణాలు అడ్డుకుంటున్నాయని తెలిపారు. కులగణన చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. తక్షణమే కుల గణన షెడ్యూలు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల కరుణాకర్, బంటు సందీప్ గౌడ్, పోలోజు మహేష్ చారి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దిష్టిబొమ్మ దహనం

భానుపురి : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ శనివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నల్లాల బావి సెంటర్‌లో ఇజ్రాయెల్ దేశ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలస్తీనా మీద ఇజ్రాయెల్ సాగిస్తున్న అరాచకాలకు భారత్ వంత పాడటం మానుకోవాలని అన్నారు. ఇజ్రాయిల్‌తో మిలటరీ సంబంధాలను విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యుడు దండ వెంకటరెడ్డి, జిల్లపల్లి నరసింహారావు, శ్రీకాంత్, పులుసు సత్యం, రవి, కొప్పుల రజిత, నరసయ్య, నాయకులు వల్లపుదాసు సాయికుమార్, వినోద్ నాయక్, షేక్ జహంగీర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు

భానుపురి : విపక్షాలు సహకరిస్తే పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి విశ్వ విద్యాలయంగా మార్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి అనడం సమంజసం కాదని శ్రీ వాసవీ సేవా సమితి సూర్యాపేట జిల్లా కన్వీనర్ బచ్చు పురుషోత్తం శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. మరేదైన ప్రాజెక్టుకు సురవరం ప్రతాపరెడ్డి జ్ఞాపకార్థంగా పేరుపెట్టి సముచిత రీతిలో గౌరవించుకుందామని తెలిపారు.

తుంగతుర్తి : తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును మార్చి సురవరం పేరు పెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆర్య వైశ్య సంఘం జిల్లా పొలిటికల్ చైర్మన్ తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలని 41రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ఆత్మ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. అలాంటి మహనీయుడి పేరు మార్చాలనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

అర్వపల్లి : హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చాలని నిర్ణయించడం ప్రభుత్వానికి తగదని ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు, బీజేపీ నాయకుడు బొమ్మిడి రామ్మూర్తి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయంగా మారుస్తామని ప్రకటించడం సరైన నిర్ణయం కాదని చెప్పారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగం చేసిన మహనీయుడు శ్రీరాములు అని తెలిపారు.

5నుంచి గ్రామాల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం'



నూతనకల్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ



పెన్‌పహాడ్‌లో..

నూతనకల్ : గ్రామాల్లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సునీత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు కోరారు. శనివారం పొట్లపహాడ్, గూడెపుకుంట తండా గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని అన్నారు. గ్రామాల్లో మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్య పరిష్కారం, కుక్కల బెడద నివారణ తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సతీష్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలపై అవగాహన



మద్దిరాలలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మద్దిరాల : సైబర్ మోసాలకు గురికాకుండా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ మధునాయుడు అన్నారు. శనివారం మద్దిరాల మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగయ్య, కానిస్టేబుల్ చందు, పాష, యల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణచారి, నాగార్జున, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగారం : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఫణిగిరి మేరీ మదర్ ఆఫ్ హోప్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఆన్‌లైన్ లాటరీలు, బహుమతులు గెలిచారని వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఏటీఎం నంబర్లు, ఓటీపీ తదితర వాటిని బహిర్గతం చేయవద్దని అన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.ఐలయ్య, హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న, పోలీసు సిబ్బంది వెంకన్న, ఎల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికం



తిరుమలగిరి: ర్యాలీలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

తిరుమలగిరి : తల్లి పాలలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించాలని మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ గిలకత్తుల ప్రియలత అన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా బీసీ కాలనీలో బాలింతలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వందన, సూపర్‌వైజర్లు ఖైరున్నీసా, మంగమ్మ, శిరీష, స్వరూపారాణి, శ్రీలత, ధనమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శోభ, అండాలు పాల్గొన్నారు.

అర్వపల్లి : పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని మండల పరిధిలోని లోయపల్లి అంగన్‌వాడీ కేంద్రం టీచర్ వల్లపు నాగమణి కోరారు. లోయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సోమమ్మ, ఆశ కార్యకర్తలు కర్మిల, జ్యోతి పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రుపాలు అందించాలని ఎంపీడీఓ హసీం అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం బోర్యాతండాలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఏఎన్ఎం వెంకటరమణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవి అని ప్రధానోపాధ్యాయుడు వెంకన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అలాగే మండల పరిధిలోని వర్ధమానుకోట, డి.కొత్తపల్లి, నాగారం, ఈటూరు, ఫణిగిరి తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, ఏఎన్ఎంలు స్వప్న, మణి, వీబీకే మల్లేపాక వెంకటయ్య, ఆశ కార్యకర్త మల్లేపాక శోభారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మల్లేపాక ఇందిరమ్మ, ఆయా కుంటపల్లి లింగమ్మ, నరహరి, సోమయ్య, యాకయ్య, సైదులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'పేట' వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కాశీనాథ్

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రానికి చెందిన కట్టికోల కాశీనాథ్‌కు తమిళనాడులోని వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శనివారం డాక్టరేట్ అందజేశారు. కరోనా విపత్కర సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడిన ఇబ్బందులపై చేసిన అధ్యయనానికి గాను వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ జి.విశ్వనాథ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

తుంగతుర్తి : కష్టపడి పనిచేసే వారికి ఎక్కడికి వెళ్లినా గుర్తింపు లభిస్తుందని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. బదిలీపై వెళ్తున్న సీడీపీఓ వెంకటరమణ, సూపర్‌వైజర్లు మంగతాయి, లక్ష్మిలను శనివారం మండల కేంద్రంలో సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్) : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు కొన్ని హామీలను మాత్రమే నెరవేర్చిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను వెలికి తీసి అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ సూర్యాపేట డివిజన్ నాయకులు ఎస్కే సయ్యద్, పిడమర్తి లింగన్న, చిత్తలూరు లింగన్న, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మద్దిరాల : జిల్లా సరిహద్దు ప్రాంతమైన కుంటపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. శనివారం సాయంత్రం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఈ నాకాబందీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలు నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

అర్వపల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్ కోరారు. సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, ఇన్‌చార్జ్ హెచ్ఎం కె.చినవెంకట్ రెడ్డి, సూపర్‌వైజర్ లలిత, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, ఏఎన్ఎంలు సైదమ్మ, శకుంతల పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ విధానంపై అవగాహన

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో శనివారం దొంగరి అరవింద్‌కు చెందిన వ్యవసాయ పొలంలో వరి సాగులో డ్రమ్ సీడర్ విధానంపై కేవీకే శాస్త్రవేత్త కిరణ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలు సకాలంలో కురవక, నార్లు పోయడం, నాట్లు వేయడం ఆలస్యం కావడంతో వరి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయడం ఒక ప్రత్యామ్నాయమని తెలిపారు. నాటుకు అవసరమైన కూలీల ఖర్చును ఆదా చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హోమ్ శాస్త్రవేత్త సుగంధి, కేవీకే యంగ్ ప్రొఫెషనల్ జి.సంతోష్, రైతులు దొంగరి అరవింద్, లక్ష్మి, సైదమ్మ, ముక్కోటి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

అర్వపల్లి : సూర్యాపేట మండలం జాటోతుతండాకు చెందిన దివ్యాంగురాలు ధరావత్ రమాదేవిని దారుణంగా హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆలిండియా పుట్టు వికలాంగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. రమాదేవిని హత్యచేసిన దుండగులపై వికలాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 91, 92 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. దివ్యాంగురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. దివ్యాంగులపై హత్యలు, అత్యాచారాలకు పాల్పడిన వారిని ఉరి తీయాలని అన్నారు. సమావేశంలో చామకూరి యల్లయ్య, కొమారి వెంకన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ డబ్బాల పంపిణీ

తిరుమలగిరి : పచ్చదనం, పారిశుద్ధ్యం నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ కోరారు. శనివారం 8వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రానికి చెత్త డబ్బాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

రుణమాఫీకి షరతులు విధించొద్దు

అర్వపల్లి : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ జాబితాలో అర్హులైన రైతుల పేర్లు లేకపోవడంతో వారు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు.